క్లుప్తంగా

నేత్రపర్వంగా అయ్యప్ప స్వామి రథోత్సవం


రథాన్ని లాగుతున్న అయ్యప్ప భక్తులు

ఓడీచెరువు : మండల పరిధిలోని ఎం.కొత్తపల్లిలో అయ్యప్పస్వామి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు బుధవారం అయ్యప్పస్వామి రథోత్సవం నిర్వహించారు. పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ అయ్యప్పస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మాలధారులు, భక్తులు శరణఘోష నడుమ రథాన్ని పుర వీధులగుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులు గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పట్టివేత

బత్తలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను బత్తలపల్లి పోలీసులు పట్టుకున్నారు. చిత్రావతి నదిలోంచి ఇసుకను తవ్వి మండలంలోని రామాపురం సమీపాన ఓబుళాపురం వెళ్లే దారిలో డంప్ చేసి.. అక్కడి నుంచి అక్రమంగా తరలిస్తున్నట్లు ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్‌కు సమాచారం అందింది. సీఐ ఆదేశాల మేరకు బత్తలపల్లి ఏఎస్‌ఐ విజయకుమార్, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్, కానిస్టేబుల్స్ నాగార్జున, జనార్దన్, రామలింగ బుధవారం దాడులు నిర్వహించారు. ఐదు ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

రెండు ట్రాక్టర్ల పట్టివేత

ముదిగుబ్బ: ఉప్పలపాడు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పోలీసుల సహకారంతో వీఆర్‌ఓ నాగేంద్ర పట్టుకున్నారు. ట్రాక్టర్లను బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వైభవంగా ఆర్జిత కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మార్గశిర మాసంలో శుభకరమైన ధనుర్మాసం దశమి చిత్తనక్షత్రం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత వసంత వల్లభునికి వైభవంగా ఆర్జిత కల్యాణోత్సవాన్ని అర్చకులు పార్థసారథి బుధవారం నిర్వహించారు.

రక్తదానం.. సామాజిక బాధ్యత

ధర్మవరం అర్బన్: రక్తదానం సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో యూటీఎఫ్, ఆత్మీయ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదానం ఆవశ్యకతపై ముద్రించిన కరపత్రాలను బుధవారం ఆయన విడుదల చేశారు.

విద్యార్థులకు బహుమతులు

పుట్టపర్తి: విజయవాడలో పౌరసరఫరాల నిర్వహించిన వినియోగదారుల దినోత్సవంలో జిల్లా నుంచి వర్చువల్‌గా పాల్గొన్న ఇద్దరు విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందించినట్లు జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్ తెలిపారు. వర్చువల్‌గా హియరింగ్స్, డిజిటల్ యాక్సెస్ టు కన్స్యూమర్ జస్టిస్ అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న క్రాంతి, వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న మైస జెన్నీస్‌కు రూ.3 వేల నగదు, మెమెంటో అందజేసినట్లు తెలిపారు.

5 నుంచి యూటీఎఫ్ మహాసభలు

కదిరి అర్బన్: యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలు జనవరి ఐదో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు కాకినాడలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నాయకులు విడుదల చేశారు. మండల విద్యాధికారులు చెన్నక్రిష్ణ, ఓబుల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారెడ్డి, మల్లికార్జున, ఆజంబాషా, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి


మాజీ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఐటీ వింగ్ ప్రెసిడెంట్ గంగిరెడ్డి

పుట్టపర్తి టౌన్: బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఐటీ వింగ్ ప్రెసిడెంట్ నల్లమాడ మండలం గోపేపల్లికి చెందిన గంగిరెడ్డికి సూచించారు. పుట్టపర్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని గంగిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేను కలిసిన వారిలో సాంబశివారెడ్డి, రఘునాథరెడ్డి, దాదిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వల్లపు రవీంద్ర, కేశవ, అంజినప్ప, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



విరిగిన బెంచీల మధ్యనే కూర్చున్న విద్యార్థులు, విరిగిన తీర్లు


కూలేందుకు సిద్ధంగా ఉన్న గదిలోనే పాఠాలు


విరిగిపోయిన కిటికీల వద్దే చదువులు

ప్రమాద ఘంటిక

- ఏళ్లనాటి భవనం.. దయనీయం
- దెబ్బతిన్న పైకప్పు.. రాలుతున్న మట్టి
- వర్షాకాలంలో తరగతి గదులు జలమయం

ధర్మవరం అర్బన్: సువిశాలమైన భవనం.. ఆహ్లాదకరమైన వాతావరణం.. ఇక్కడ చదువుకున్న వారిలో ఎంతోమంది ప్రయోజకులై ఉన్నత స్థానాలు అధిరోహించారు. అంతటి చరిత్ర కలిగిన జూనియర్ కళాశాల భవనం నేడు శిథిల దశకు చేరుకుంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియదు. ప్రమాద ఘంటికలు పొంచి ఉండడంతో విద్యార్థులు అభద్రత నడుమ చదువులు కొనసాగిస్తున్నారు. ధర్మవరం పట్టణ నడిబొడ్డున 1931లో నిర్మించిన భవనంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఏర్పాటు చేశారు. 1969లో భవనం పై అంతస్తులో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభించారు. ఆరు గదుల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, సెరికల్చర్, ఎంఎల్‌టీ, ఈటీ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌తో పాటు 11 మంది రెగ్యులర్ లెక్చరర్లు ఏడుగురు కాంట్రాక్ట్ లెక్చరర్లు, ఇద్దరు ఒకేషనల్ లెక్చరర్లతో పాటు ఒక లైబ్రేరియన్ ఉన్నారు. ప్రస్తుతం 300 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

భయం.. భయం

జూనియర్ కళాశాల తరగతి గదులు ఎప్పుడు కూలుతాయోనన్న భయం విద్యార్థులను, అధ్యాపకులను వెంటాడుతోంది. విరిగిన కిటికీలు, నెర్రెలు చీలిన గోడలు, ధ్వంసమైన తలుపులు, పెచ్చులూడుతున్న, దెబ్బతిన్న తీర్లతో గదులు ప్రమాదకర స్థితికి చేరాయి. అధ్యాపకులు చెప్పే పాఠాలను ఆసక్తిగా వింటున్న సమయంలో ఊడి పడే పెచ్చులతో విద్యార్థులు ఉలిక్కిపడుతున్నారు. ఇక వర్షాకాలంలో పరిస్థితి మరీ ఘోరం. ఓ వైపు వర్షం నీరు కారుతుండగా.. మరోవైపు మట్టి ధారగా పడుతుండడంతో గదుల్లో కూర్చోలేని పరిస్థితి.


జూనియర్ కళాశాలలో దెబ్బతిన్న భవనం పైకప్పు

పెచ్చులూడి పడుతున్నాయి



తరగతి గదిలో చదువుకునే సమయంలో పైకప్పు పెచ్చులు ఊడి మీద పడుతున్నాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని చదువుకుంటున్నాం. ఇక వర్షం వచ్చిందంటే మొత్తం పైకప్పు నుంచి వర్షం నీరు కారుతుండటంతో పుస్తకాలన్నీ తడిచిపోతున్నాయి. నూతన గదులు నిర్మిస్తే చదువుకు అనుకూలంగా ఉంటుంది.

– అశోక్, జశ్వంత్, విష్ణువర్ధన్, హెచ్ఈసీ ఫస్టియర్ విద్యార్థులు

నూతన భవనం నిర్మించాలి



తరగతి గదుల పైకప్పు పూర్తిగా దెబ్బతింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. చెక్క తీర్లు విరిగిపోయాయి. పైకప్పు నుంచి నిత్యం మట్టి, పెచ్చులు ఊడి పడుతున్నాయి. వర్షం వస్తే జలమయమే. అధికారులు స్పందించి నూతన భవనం నిర్మించి, విద్యార్థుల ప్రాణాలు కాపాడాలి.

– చైతన్య, సీఈసీ సెకండియర్ విద్యార్థి

అవమానించిన వారిని శిక్షించండి

ధర్మవరం అర్బన్: తిరుపతిలో అన్నమాచార్య విగ్రహానికి క్రైస్తవులకు సంబంధించిన శాంతాక్లాజ్ టోపీని పెట్టి అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి పులిచెర్ల వేణుగోపాల్, అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్ల పుల్లయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం ముందున్న అన్నమాచార్య విగ్రహం వద్ద బుధవారం విశ్వహిందూ పరిషత్, అన్నమయ్య సేవా మండలి సభ్యులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కలవల రామ్‌కుమార్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత బుక్కపట్నం జట్టు


విజేత జట్టుకు కప్పు అందిస్తున్న సర్పంచ్ తదితరులు

పుట్టపర్తి: వాలీబాల్ పోటీల విజేతగా బుక్కపట్నం జట్టు నిలిచింది. బుధవారం ఫైనల్‌లో కర్ణాటక నాగేపల్లి జట్టు, బుక్కపట్నం జట్టు తలపడ్డాయి. విజేతగా నిలిచిన బుక్కపట్నానికి చెందిన కత్తె రాజు టీమ్‌కు రూ.30వేల నగదు, కప్పును సర్పంచ్ నాగలక్ష్మి చేతులమీదుగా అందించారు. క్రీడాకారులకు సర్పంచ్ భోజన వసతి కల్పించారు. న్యాయ నిర్ణేతలుగా, పలమనేరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, వెంకటేష్‌నాయక్, డైట్ కళాశాల వ్యాయామ అధ్యాపకుడు రామకృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో సామకోటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు చార్జీల పెంపు తగదు

- 27న పోరుబాట జయప్రదం చేయండి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాస్‌రెడ్డి

ధర్మవరం: కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, చేనేత నాయకుడు కాచర్ల అంజి మండిపడ్డారు. పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే ఉపసంహరించాలన్న డిమాండ్‌తో ఈ నెల 27న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నేతృత్వంలో ధర్మవరం మార్కెట్ సమీపాన విద్యుత్ కార్యాలయం ఎదుట 'పోరుబాట' నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం కేతిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలంటూ విపరీతమైన ప్రచారం చేసి.. అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మోసం చేశారని ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచేది లేదని చెప్పి.. ఇప్పుడు మాట తప్పారని విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపు కారణంగా రూ.15వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపడం దుర్మార్గమన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి 'పోరుబాట' నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, కేతా లోకేష్, మేడాపురం వెంకటేశ్, బోయ రమాదేవి, గజ్జల శివ, బాలం ఓబుళమ్మ, వార్డు ఇన్‌చార్జ్‌లు కత్తె పెద్దన్న, చెలిమి పెద్దన్న, బడన్నపల్లి కేశవరెడ్డి, జింకా కంబగిరి, రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి, చింతకాయల నరేష్, చౌడప్ప, బొమ్మన్న, లోనికోట నారాయణస్వామి, మహేష్, జయరాం, చంద్ర, మల్లికార్జున, చెన్నా ప్రసాద్, వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, వేముల అమర్‌నాథ్ రెడ్డి, రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరంలో పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


గాండ్లపెంటలో పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రజలపై భారం మోపడమేంటి?

గాండ్లపెంట: ఎన్నికల హామీలు అమలు చేయలేక ప్రజలపై భారాలు మోపడమేంటని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి ప్రశ్నించారు. కరెంటు చార్జీల బాదుడుపై ఈ నెల 27న కదిరిలో చేపట్టే 'పోరుబాట' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం గాండ్లపెంటలోని వైఎస్సార్ కూడలిలో ఆవిష్కరించారు. మండల కన్వీనర్ మాట్లాడుతూ పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఎస్పీ హైదర్‌వలి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, మాజీ డైరెక్టర్ ఫారుక్, పుల్లారెడ్డి, నాయకులు పామిడి ఇక్బాల్, క్రాస్ రవీంద్రారెడ్డి, మాజీ వలంటీర్లు పాల్గొన్నారు.

'పోరుబాట' జయప్రదం చేయండి

నల్లచెరువు: ఈ నెల 27న కదిరిలో నిర్వహించే పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దశరథనాయుడు కోరారు. బుధవారం నల్లచెరువులోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యమక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి నాయకులు పెద్ద మౌలాలి, కె.శ్రీనివాసులు, రామాంజనేయులు, చిన్న రెడ్డెప్ప అంజీ వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: కరెంటు చార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం పుట్టపర్తిలో చేపట్టే పోరుబాటకు బుక్కపట్నం మండల వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

నిరసన ర్యాలీకి తరలిరండి

ముదిగుబ్బ: విద్యుత్ చార్జీల పెంపుకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 27 ధర్మవరంలో చేపట్టే నిరసన ర్యాలీకి ముదిగుబ్బ మండలం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు తరలిరావాలని ఆ పార్టీ నేత గుర్రం శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.


నల్లచెరువులో పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వాజ్‌పేయికి ఘన నివాళి

కదిరి టౌన్/ బత్తలపల్లి/ పుట్టపర్తి టౌన్: మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కదిరిలోని కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి మాట్లాడుతూ దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలను కొనియాడారు. బత్తలపల్లి మండలం నంజీవపురం వద్దనున్న కేజీబీవీలో బీజేపీ మండల కన్వీనర్ ఆకులేటి వీరనారప్ప ఆధ్వర్యంలో వాజ్‌పేయి జయంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేశారు. పుట్టపర్తిలోని బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు. కర్ణాటకనాగేపల్లి వద్దనున్న వృద్ధాశ్రమంలో బ్రెడ్లు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ జ్యోతి ప్రసాద్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, కోశాధికారి సురేంద్రబాబు, జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ బాలగంగాధర్, నాయకులు గంగిశెట్టి, భాస్కర్, నారాయణ, నారాయణస్వామి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


కదిరిలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి

పండ్ల పంపిణీ

తాడిమర్రి: మండల కేంద్రంలో బుధవారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జి.గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధిలో పర్యటిస్తూ ప్రజలకు అరటి పండ్లను పంపిణీ చేశారు. మండల అధ్యక్షులు ఎస్పీ పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

ఎన్పీ కుంట : ధనియాని చెరువు గ్రామంలో బుధవారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. జిల్లా కార్యనిర్వహణ అధికారి డీఎల్‌డీఏ డాక్టర్ జి.వి.సుధాకర్, వైద్యాధికారి బాలానాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ముదిగుబ్బ: ముదిగుబ్బ బస్టాండ్ వద్ద బుధవారం రోడ్డు దాటుతున్న సాదిక్‌ను ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సాదిక్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మనుధర్మశాస్త్రం ప్రతుల దహనం

ధర్మవరం: భారత రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి కొత్త రూపాల్లో నిరాటంకంగా అమలు చేస్తుండటాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ధర్మవరం కళాజ్యోతి సర్కిల్‌లో మనుస్మృతి ప్రతులు దహనం చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త నరేష్ యనమల మాట్లాడుతూ మంత్రి సత్యకుమార్ కూడా వంతపాడుతూ అంబేద్కర్‌ను కాంగ్రెస్ అది చేసింది, ఇది చేసింది అంటూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని మండిపడ్డారు. అంబేద్కర్ పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే హోంమంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కలీం, రోషన్‌జమీర్, జాఫర్, షబ్బీర్, సయ్యద్ ఖాదర్‌వలి, నబిరసూల్, దాదాపీర్, సాధిక్, ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సబ్సిడీ సోలార్ సద్వినియోగం చేసుకోండి

అమడగూరు: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీపై ఇచ్చే విద్యుత్ సోలార్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏఈ చంద్రానాయక్ తెలిపారు. బుధవారం ఆయన మహమ్మదాబాద్‌లో ఎస్సీ, ఎస్టీలకు ఈ సోలార్‌పై అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునే విధానాన్ని తెలియజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కదిరి అర్బన్: జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను నాయకులు బుధవారం ఎమ్మార్సీలో ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, కోశాధికారి జయచంద్ర నాయుడు, ఉమ్మడి జిల్లాల సీఆర్‌ఓ కోటిరెడ్డి, కదిరి డివిజన్ అధ్యక్షుడు సురేష్, మండల విద్యాధికారులు చెన్నకృష్ణ, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలభైరవస్వామి గ్రామోత్సవం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చక్రవర్తి థియేటర్ ఏరియాలో కాలభైరవస్వామి ఆలయంలో బుధవారం పూజారి ధనంజయ ఆచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలభైరవ స్వామి ఉత్సవమూర్తిని పల్లకీపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

పేకాటరాయళ్ల అరెస్ట్

తనకల్లు: మల్లరెడ్డిపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపీ తెలిపారు. వీరి నుంచి రూ.56,110 నగదు, 12 బైక్‌లతో పాటు 12 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.


కదిరిలోని జోర్డాన్ బ్లెస్సింగ్ చర్చిలో సందేశమిస్తున్న పాస్టర్ విద్యాసాగర్


తలుపులలో ప్రార్థన చేయిస్తున్న పాస్టర్ డేవిడ్



ఓడీసీలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు, పుట్టపర్తి కింగ్స్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు



ప్రశాంతి గ్రాం చర్చిలో చీరల పంపిణీ, తాడిమర్రి చర్చిలో చిన్నారుల సందడి


అమడగూరులో క్రిస్మస్ వేడుకలు


ధర్మవరం దుర్గానగర్ చర్చిలో పాస్టర్ మేషక్ ప్రసంగం

ప్రేమ.. క్షమ క్రీస్తు సందేశం

కదిరి/ తలుపుల/ ఓడీచెరువు, పుట్టపర్తి టౌన్/ ధర్మవరం అర్బన్/ తాడిమర్రి/ గాండ్లపెంట/ ఎన్పీకుంట/ అమడగూరు/కనగానపల్లి/చెన్నేకొత్తపల్లి: ప్రేమ.. క్షమ క్రీస్తు సందేశమని పాస్టర్లు పేర్కొన్నారు. అందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నదే ఆయన బోధనల సారాంశమని అన్నారు. బుధవారం కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవులు ఉదయాన్నే చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, ఆకాశమంతటి సహనం చూపించాలని జీసస్ తన జీవితం ద్వారా సందేశాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. అవధులు లేని త్యాగం, శాంతియుత సహజీవనం, శత్రువుల పట్ల క్షమాగుణం ఉండాలని బోధించారన్నారు. క్రీస్తు జననం లోకానికి వెలుగని, ఆయన రాక అందరికీ శుభోదయమని పేర్కొన్నారు.


కనగానపల్లి మండలం సీఎన్ కోట ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు

బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో పలువురికి చోటు దక్కింది. బీసీ సెల్ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన కొత్తచెరువుకు చెందిన వడ్డే నారాయణను పార్టీ నాయకులు బుధవారం సన్మానించారు. తనను నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరించిన మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి వడ్డే నారాయణ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పాదయాత్ర వాల్మీకి శంకర్, జెడ్పీటీసీ గంగాదేవి, టౌన్ కన్వీనర్ భాస్కర్ నాయకులు యుగంధర్, పెయింటర్ గిరి, వెంకటరాముడు, వడ్డే శ్రీనివాసులు, సాయిప్రకాశ్, ఎల్లప్ప, రఫీ తదితరులు పాల్గొన్నారు.


వడ్డే నారాయణను సన్మానిస్తున్న నాయకులు